# ఒకే రెమ్మా - రెండు పువ్వులూ

రాత్రి ఎనిమిదిన్నర చూపిస్తూంది క్లబ్బులో గడియారం.

ఉన్నట్టుండి నాలుగు మూలలనించి నల్లని మేఘాలు చుట్టేశాయి. గాలి... జల్లుతో ఆరంభించిన వర్షం మూడు నిమిషాలలోనే కుండపోతగా కురియడం ఆరంభించింది.

"ఏమిటి వర్షమే !" అన్నాడు సీరియస్‌గా పేక ముక్కలలోంచి తలెత్తి రిటైర్డ్ డి. ఎస్. పి మాధవరావు.

"అబ్బేకాదు. వెన్నెల కురుస్తూంది" అన్నాడు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆనందరావు కాస్త వేళాకోళంగా.

గాలికి ఎగిరిపోతున్న పేకముక్కలకి చెయ్యి అడ్డం పెట్టి "బోయ్ కిటికీ బంద్ కరో" అంటూ అరచాడు సెషన్స్ జడ్జి రంగారావు.

"ఏమిటీ అకాలవర్షం! బాప్ రే ఇంటికి ఎలా వెళ్లడం? ఈ ఆఖరి రౌండు అవగానే బయలుదేరుదామనుకున్నాను. అప్పుడే ఎనిమిదిన్నర అయింది. ఎప్పటికి తగ్గుతుందో ఈ వర్షం" కారులేని ప్లీడరు పురుషోత్తం ఇంటికి వెళ్ళడం గురించి బెంగ పడడం ఆరంభించాడు.

"ఏం, ఎనిమిదిన్నర దాటితే మీ ఆవిడ అన్నం పెట్టదా ఏమిటి ?" ఆనందరావు నవ్వాడు ముక్క వేస్తూ. ఆనందరావు మాటలని మింగేస్తూ యెక్కడో పెద్ద పిడుగు

పడడం, వెంటనే కరెంటు పోవడం క్షణంలో జరిగాయి. చిమ్మచీకటి.

"చచ్చాం, ఏదో వర్షం తగ్గేవరకు ఆడుకోడానికి కూడా కరెంటు పోయింది" డాక్టరు శ్రీనివాసరావు నీరసంగా వెనక్కి వ్రాలాడు కుర్చీలో.

"ఆట కలిపేద్దామా?" ఆట ఆరు రౌండులు తిరిగినా మొదట సిక్వెన్సుకే ముక్క కలియక అవస్థపడుతున్న పురుషోత్తం ముక్కలు కలిపేయబోయాడు.

"ఆ...ఆ.. కలపకండి లైట్లు వచ్చేస్తాయి" ఒకముక్క కలిస్తే షోకి సిద్ధంగా ఉన్న రంగారావు గాభరాగా వారించాడు. "లైట్లు ఊరంతా పోయినట్లున్నాయి. వెంటనే వచ్చేస్తాయి."

"కాండల్స్ ఉన్నాయేమో! బోయ్" పిల్చాడు ఆనందరావు.

కరెంటు పోయి ఐదునిమిషాలు గడిచింది. వర్షం, గాలి ఎడా పెడా దంచుతూంది. బోయ్ కాండిల్స్ వెలిగిస్తున్నట్టుంది. మినుకు మినుకు మంటూ గుడ్డి వెలుగు పడుతూంది.

"అదిగో బోయ్ కాండిల్స్ తెస్తున్నాడు" అన్నాడు రంగారావు హుషారుగా. "కరీమ్ ఒకకాండిల్ ఇటుపట్రా" అని కేకేశాడు.

"కాండిల్స్ అట్టేలేవు సార్. నాలుగైదువుంటే తలో గదిలో తలోటి పెట్టాను" అన్నాడు బోయ్.

గదిమధ్య ఉన్న కాండిల్ వెలుగులోనే ఆట ఆడా లని రంగారావు తాపత్రయ పడ్డాడుగాని ముక్కలు కను పించక అందరూ కార్డ్సు టేబిల్ మీద పడేశారు.

"ప్చ్, యీ చీకటిలో కూర్చుని జపం చెయ్యాలన్న మాట ! ఇంటికి పోదామన్నా కారు దగ్గరకి వెళ్ళేలోపల తడిసి ముద్దవుతాం. అందులో కారివాళ దూరంగా కూడా పార్కు చేశాను." ఆనందరావు విసుగ్గా అన్నాడు.

ఐదుగురు బద్ధకంగా వళ్ళు విరుచుకున్నారు. ఆవ లించారు. చిటికెలు వేశారు. ఇద్దరు సిగరెట్లు అంటించారు.

"అబ్బబ్బ, ఏంచలి. ఒక్కసారిగా వాతావరణం ఇలా మారిపోయిందేమిటి" పురుషోత్తం వణికాడు. "లైట్లు తొందరగా వచ్చేట్టులేవు. వస్తే యీ పాటికి వచ్చేయాల్సింది..." అన్నాడు.

"ఓ సిగరెట్ అంటించండి సార్ !" డి. యస్. పి. సిగరెట్లు ఆఫర్ చేశాడు. "సరి... సరి, ఈ వయసులో ఇప్పుడింకేం అలవాటు చేసుకుంటాను... కాస్త వేడివేడిది ఏదన్నా పడితే బాగుండును"

"అవునవును తెప్పించండి సార్ !" చమత్కారంగా అన్నాడు డాక్టరు. "నేనా ?... అసలే ఇవాళ యాభై రూపాయలు పోయాయి ఇవాళ ఎవరు గెలుపులో వున్నారో వాళ్ళిప్పించాలి..."

"ఇంకెవరు ? మన రావే అయుండాలి. నా దగ్గర పాతిక, మీ దగ్గర యాభై. మనల్ని నవ్విస్తూనే ఆట గెలిచేసి ఆ తర్వాత ఏడిపిస్తాడు" అని ఆనందరావు వైపుకు తిరిగి

"ఇంక లాభంలేదు భాయ్... అందరి దగ్గర కొట్టేసిన డబ్బు ఖర్చు పెట్టాల్సిందే, ఇలాంటి అపర సంధ్యలో భూతప్రీతి చాలా అవసరం. బేరర్ని పిలిపించు" అన్నాడు డి. ఎస్. పి.

"చచ్చాం... సరే కానీండి. తప్పుతుందా! బోయ్.." ఆనందరావు పిలిచాడు.

పుల్ఫాగా వచ్చిన డ్రింక్‌తో ఉత్తేజం, ఉత్సాహం పుంజుకొన్న డాక్టరుగారికి ఉషారెక్కువయి "వాతావరణం మజాగావుంది రావుగారూ, మాంచి కథేదన్నా చెప్పండి సార్" అన్నాడు.

"మీకు డ్రింక్స్ సప్లయ్ నేనే... ఎంటర్‌టయిన్ మెంటు యివ్వడం అన్నీ నేనేనా ?"

"మీరుకాక మరెవరున్నారు సార్. కథలు చెప్పినా, కబుర్లు కాకరకాయలు చెప్పినా మీరే చెప్పాలి. ఏదన్నా మాంచి కథ మొదలు పెట్టండి, కాలక్షేపం అవుతుంది" పురుషోత్తం.

"ఏం కథలొస్తాయి అస్తమానూ" బద్దకంగా ఆవలించాడు ఆనందరావు. "ఏదో మొదలు పెట్టండి స్వామీ. మొదలు పెట్టడమే మీ వంతు. తరువాత మీ ప్రమేయం అక్కర లేకుండానే కథగా పూర్తి అయిపోతుంది" ఆనందరావు వాగ్ధోరణి తెల్సిన రంగారావు నవ్వుతూ అన్నారు.

నవ్వాడు ఆనందరావు.

ఆనందరావుకి ఆ క్లబ్బులో ప్రత్యేకమయిన గుర్తింపు వుంది. అతని వాగ్ధోరణి, అతని చమత్కారం, అతని సెన్స్ ఆఫ్ హ్యూమర్, అతని ఫ్రెండ్లీ నేచర్‌ని ఎప్రిషియేట్ చేస్తా

రందరూ. అతన్ని ఒక్కసారి చూసినవాళ్లు అతని స్నేహాన్ని కాంక్షించకుండా ఉండలేరు. ఆ క్లబ్బునే రకరకాల గ్రూపులు, జట్లు జట్లు మనుష్యులుండచ్చు. రమ్మి, బ్రిడ్జి, బిలియర్డ్స్, చదరంగం, టెన్నిస్, బాడ్మింటన్ వగైరా వగైరాలకి అలవాటయిన గ్రూపులు కనిపిస్తూంటారు... ఎవరి గ్రూపు వాళ్లతో వాళ్ళే ఆడుకుంటారు. సాధారణంగా క్రొత్తవాళ్ళని తమ గ్రూపుల్లో కలియనీయరు! అలాంటి గ్రూపులవాళ్ళు కూడా ఆనందరావు క్లబ్‌కి రాగానే విష్ చేస్తారు. మాట కలపడానికి ప్రయత్నిస్తారు. తమ గ్రూపులో కలుపుకోడానికి తాపత్రయపడ్తారు. రిటైరయిన వయసులో కూడా పాతికేళ్ళ కుర్రాడి ఉత్సాహం, ఉత్తేజం అతనిలో, అతనిమాటల్లో కనిపించడం చాలా మందికి ఆశ్చర్యం కలిగిస్తుంది. వయసు అతని శరీరానికిగాని మనసుకి రాలేదని అతనితో ఏమాత్రం పరిచయం వున్నవాళ్ళయినా ఇట్టే గ్రహిస్తారు! నెరిసిన జుత్తుచూసి అతను వయసు మళ్ళిన వాడనుకోవాలి తప్ప అతని ఏ ఏక్టివిటీస్‌కి వయసు ముదరలేదని అతనితో నాలుగు రోజుల పరిచయం చెపుతుంది.

ఆ క్లబ్బులో మొదటినించీ ఆనందరావు, జడ్జి రంగారావు, డి. యస్. పి. మాధవరావు, ప్లీడరు పురుషోత్తం నలుగురూ బ్రిడ్జి గ్రూపు. వాళ్ళ టేబిల్ దగ్గిరికి మరొకరిని చేరనీయరు! డాక్టరు శ్రీనివాసరావు క్లబ్బుకి రెగ్యులర్‌గా రాడు. ప్రాక్టీసుతో రాత్రి తొమ్మిది వరకు ఊపిరి ఆడని ఆయన ఏ మూడు నాలుగు రోజులకోసారో కాస్త తీరు

బాటు దొరికితే వస్తూంటాడు. శ్రీనివాసరావు వచ్చిన రోజున మాత్రం అతన్ని చేర్చుకుని మూర్చుకి ఐదుగురున్నారని రమ్మీ ఆడుతారు. పేకాట ఆడుతూ ఆనందరావు చెప్పే కబుర్లకి, కథలు, కల్పనలు, విట్లు వింటూ నవ్వలేక అవస్థ పడుతూంటారు వాళ్ళు! ఏ రోజన్నా ఆనందరావు క్లబ్బుకి రాకపోతే ఆ క్లబ్బులో ఆ సాయంకాలం కాలచక్రం నిలిచి పోతుంది. ప్రతీవ్యక్తి ఏదో పోగొట్టుకున్నట్టు దిగులుగా ఓ అరగంట కూర్చుని ఇళ్ళకి వెళ్ళిపోతూంటారు. తనకోసం కాకపోయినా తన కంపెనీకోసే స్నేహబృందం కోసం అయినా రోజూ సాయంత్రం ఆరుగంటలకి వచ్చి ఎనిమిది న్నర వరకూ క్లబ్బులో గడపడం ఆనందరావు తప్పని దిన చర్య!

"ఏం కథ చెప్పను?" ఆనందరావు ఆలోచన తెమల లేదు చాలా సేపటివరకు.

"మొదలు పెట్టండిసార్, ఈ చల్లటి సాయంకాలాన్ని వేడెక్కించే చక్కటికథ - వినేసరికి వర్షం నజ్జు అంతా వదిలిపోవాలి... ఊఁ... కమాన్" తొందర పెట్టాడు రంగా రావు.

"సరే, అయితే చెప్తాను. కాని ఇది నిజం కథ!... ఓ పెళ్ళాం, ఓ ప్రేయసీవున్న మొగాడి కథ."

"పెళ్ళాం. ప్రేయసీ...ది యటర్నల్ ట్రయాంగిల్... అచ్ఛా? వెరీ ఇంటరెస్టింగ్... చెప్పండి" ఉత్సాహంగా అన్నాడు డి. యస్. పి. మందు అప్పటికే బాగా తల

కెక్కింది. ఈ పరిస్థితిలో ఎక్కాల పుస్తకం చదివేసినా 'గొప్ప కథ' అని తలూపుతాడు.

"అనగనగా... ఓ... ... పేరెందుకులెండి. 'సమెక్స్' అందాము! అతను 'యక్స్' అయితే భార్య 'వై' ప్రేయసి 'జడ్' అనుకుందాం..."

"అబ్బబ్బ లెక్కల మాష్టారి బుద్ధి పోనిచ్చుకున్నారు గాదు. ఈ X Y Z లు ఎవరికి గుర్తుంటాయి.. నిజం పేర్లు కాకపోతే మారుపేర్లన్నా పెట్టండి సార్ !" లెక్కలంటే నిద్రలో కూడా దడుచుకునే పురుషోత్తం అర్థింపు.

"పేర్లకేముంది. హీరోగారు శృంగార పురుషుడు కనుక కృష్ణమూర్తి అందాం. పెళ్ళాం రుక్మిణి అనుకుంటే ప్రేయసి సత్యభామ అనుకుందాం."

"కొంపదీసి మోడర్న్ పారిజాతాపహరణం చేస్తారేమిటి ?"

"అబ్బ, చెప్పనీవయ్యా"

"సారీ—ప్రొసీడ్ సర్"

"ఆగండాగండి. ఓ చిన్న సందేహం. ఆ కృష్ణపరమాత్మగారికి ముందు ప్రేయసీ ఉన్నాక పెళ్ళాంవచ్చిందా? పెళ్ళాం ఉన్నాక ప్రేయసీ దొరికిందా ?" డాక్టరుగారి ధర్మ సందేహం.

"అతనికి పెళ్ళి పెళ్ళాం, ఇద్దరుపిల్లలుకూడా ఉన్నాకే ప్రేయసీ దొరికింది."

"బాగుంది. ప్చ్. అలాంటి ప్రేయసీలు అందరికీ దొరికితే బాగుండు... ఇంటర్వెల్లో శనక్కాయలు తిన్నట్లు జీవితం మధ్య మధ్యయినా రుచిగా వుంటుంది" పెళ్ళయిన రెండో నెల నుంచి వాంతులు, వేవిళ్ళు. తరువాత ఏడాదికో పిల్ల చొప్పున ఏడుగురు పిల్లల్నికని తోలు అయిన పెళ్ళాం జ్ఞాపకం వచ్చింది పురుషోత్తంగారికి.

"అందరికీ వుంటే కథెందుకు అవుతుంది సార్ !" ఆనందరావు నవ్వాడు.

"కరెక్ట్... ఇంతకీ ఆ ప్రేయసీ యెలా దొరికింది ? పెళ్ళాం పిల్లలు వున్నవాడిని ఆ పిల్ల ఎలా ప్రేమించింది సార్ ?" మూడో పెగ్గుకి, నాలుగో పెగ్గుకి మధ్య వచ్చిన కాస్తపాటి తెలివిలో తెలివయినప్రశ్న రువ్వాడు డి. యస్. పి.

"పిల్ల ఏమిటి ? ఆ ప్రేయసీకూడా ఒకరి పెళ్ళాం, ఇద్దరు పిల్లల తల్లి..."

"ఏమిటీ ?" నోరెళ్ళపెట్టి గటగట గ్లాసు ఖాళీ చేశాడు ఆ షాక్ తట్టుకోడానికి.

"ఈ కృష్ణుడు ఆ సత్యభామ ప్రేమించుకునే నాటికి ఇద్దరికిద్దరికి పెళ్ళిళ్ళు, పిల్లలు, చెరి పదేళ్ళ వైవాహిక జీవితం గడిపిన వారే. అతనికో ముప్ఫైఐదు, ఆవిడకో ముప్ఫై రెండేళ్ళు వుంటాయి..."

"సరి. మన హీరో దక్షిణ నాయకుడన్నమాట— వెరీ యింటరెస్టింగ్ ! చెప్పండి, చెప్పండి. అసలు వాళ్ళెలా ప్రేమించుకున్నారు ?... అది సరేగాని ఇద్దరికిద్దరికి మొగుడు పెళ్ళాలు ఇంట్లో వుండగా ఎలా వీలయిందయ్యా ప్రేమా

యణం నడిపించడానికి. వాళ్ళకి తెలియకుండా ఎన్నాళ్ళు నాటకం ఆడగలిగారు..." రంగారావుగారి ధర్మసందేహం.

"యెన్నాళ్ళో నాటకం లేదు. ఓ సంవత్సరం మాత్రమే డబుల్‌రోల్ ! తరువాత పెళ్ళాంపాత్ర వదిలేసి ఆమె ప్రేయసీ పాత్ర ధరించింది" - ఆనందరావు నవ్వుతూ అన్నాడు.

"అంటే, మొగుడ్ని వదిలేసిందా ఏమిటి ?" ప్లీడరుగారి ఆరాటం.

"ఆహాఁ !"

"వదిలేసి అప్పటినుంచి ఆ ప్రియుడు దగ్గిరే ఉందా ?"

"మహారాజులా !"

"ఏమిటి అతనింట్లోనేనా, వేరేవుందా ?"

"అతనింటిలోనే..."

"మరి పెళ్ళామో !" ఈ కాంప్లికేషన్ తనకు తెలిసిన ఏ "లా"కి లొంగడం లేదని తికమక పడిపోయారు లాయరుగారు.

"పెళ్ళామూ ఉంది, ప్రేయసీవుంది ఆ ఇంటిలోనే."

"ఏమిటి ఒక ఇంటిలోనే. అబ్సర్డ్ నేనన్నమ్మను. అలా ఏ పెళ్లాం వూరుకుంటుందండీ. ఎన్నాళ్ళూరుకుంటుంది ?" డాక్టరుగారు టేబిల్ చరిచి మరీ అపనమ్మకాన్ని వెల్లడించారు.

"ఊరుకోడం ఏమిటి ? ఎన్నాళ్ళేమిటి ? ఇంకా కలిసే వున్నారు, ఇరవై ఏళ్ళనుంచి." తాపీగా గ్లాసు టేబిల్‌మీద పెడ్తూ అన్నాడు ఆనందరావు.

ఆ ఆశ్చర్యంతో నలుగురికీ మత్తు దిగిపోయినంత పన యింది. డి. యస్. పి. గార్కి ఇదంతా చాలా కన్ఫ్యూజన్‌గా ఉంది. "అసలు సరిగా ముందునించి చెప్పండిసార్, అసలు వాళ్లెలా కలుసుకున్నారు? ఎలా ప్రేమించుకున్నారు? ఆవిడ మొగుడేమయ్యాడు ?"

ఆనందరావు కుర్చీలో వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకున్నాడు.

"మన హీరో ఆ ఊళ్ళో అప్పుడు కాలేజీ లెక్చరర్‌గా వుండేవాడు. అప్పటికే అతనికి పెళ్ళిఅయిందని, ఇద్దరు పిల్లలని చెప్పాగా..."

"అతని భార్య బాగుండదా ఏమిటి ?" మళ్ళీఅడ్డాడు పురుషోత్తం.

"బాగుండడం అంటే పెద్ద అందకత్తె కాకపోవచ్చు, కాని అనాకారి కాదు. మనిషెలా ఉన్నా మనసు చాలా మంచిది. ఆవిడకి భర్తంటే ప్రాణంకన్నా ఎక్కువ! భర్త సంతోషం కోసం ఏ త్యాగాలన్నా పూర్వకాలపు పతివ్రతల్లా చేసేస్తూంటుంది. అలనాటి సుమతిలా భర్తకోరిక తీర్చడానికి స్వయంగా వేశ్య దగ్గిరికి తీసికెళ్ళలేకపోయినా, భర్త తనని ఆదరించి అభిమానిస్తే చాలు. భర్త ఇతర ఇష్టాఇష్టాలకి, ఆనందాలకి ఆవిడ అడ్డురాదు. అతను ఇంకెవరినన్నా ప్రేమించినా ఫరవాలేదు. తనని మాత్రం ప్రేమించితే చాలనేంత మంచితనం, ఔదార్యం, క్షమ చూపగలిగేంత మంచిది ! చెయ్యెత్తి దండం పెట్టచ్చు ఆమెకి..."

"అందుకే, ఏకంగా ఇంటిలోనే తెచ్చిపెట్టగలిగాడు ప్రేయసీని. అందరి పెళ్ళాలు అంత మంచి వాళ్ళయితే మనమూ తలో ప్రేయసీని సంపాదించలేక పోయేవాళ్ళమూ?" ఇంటిలో సూర్యకాంతమ్మని జ్ఞప్తికి తెచ్చుకుని నిట్టూర్చి అన్నారు జడ్జిగారు.

"మరి అంత మంచి పెళ్ళాంమీద ఇతని కిష్టంలేదా? అంతలా ప్రేమించే భార్య మంచితనాన్ని ఎక్స్‌ప్లాయిట్ (Exploit) చేసి తీసుకోడం ఇతనికేం న్యాయం?"

"భార్యంటే అతనికిష్టం లేకపోవడం ఏమిటి? ఆవిడంటె ఇష్టం ఉంది, అభిమానం ఉంది, అనురాగం ఉంది. ఆవిడ లేకపోతే ఒక్కరోజు గడుపుకోలేడు. ఒక పసివాడి లాగ ఆమెమీద అన్నింటికి ఆధారపడ్డాడు. ఆ అవసరాన్ని తీర్చి ఆమె సేవాధర్మాన్ని కోరుకుంటాడు. కాని ప్రేమ, అది వేరే విషయం. ఆరాధన ఉన్నచోట ప్రేమకి తావుండదను కుంటాను. ఆ విధంగా ఆలోచిస్తే సత్యభామతో అతను పంచుకో గలిగింది ప్రేమ. ఒక ప్రక్క తనని ఆరాధించే భార్యపట్ల వ్యామోహం, ఇటు తనప్రాణానికి ప్రాణాన్నిచ్చే సత్యభామతో తాదాత్మ్యం. ఇద్దరినీ వదులుకోలేడు. మనిషిని పరిపూర్ణుణ్ణి చేసే రెండు విభిన్న ప్రవృత్తులకి ప్రతినిధులు వాళ్ళు. వాళ్ళమధ్య తన జీవితం సమగ్రమయిందంటాడు."

"ఓహోహో! సైకలాజికల్ పాయింట్ బాగా తీశారే—కాస్త కవిత్వం కూడా మిళాయించి!" మెచ్చుకున్నారు డాక్టరుగారు.

"అందుకే ఇద్దర్నీ ఉంచుకున్నాడన్నమాట. బాగుంది. ఇంతకీ ఆ సత్యభామ కథేమిటో ముందు చెప్పండి సార్. ఆవిడ యెలా ఉంటుంది, ఇంతలా అతను ప్రేమించాడంటే ఆమె చాలా అందకత్తె అయుండాలి" డి. యస్. పి. అడిగాడు.

ఆనందరావు నవ్వాడు. "అందానికి కొలత ఏముంది? అతని కళ్ళతో చూడాలిమీరు, ఆమె అందం తెలుసుకోవా లంటే..."

"సరేగాని వీళ్ళపరిచయం, ఎలా ప్రేమించుకున్నదీ ఆ కథ చెప్పండి."

"సత్యభామ భర్త ఆ ఊర్లో కలక్టరు." ఆనందరావు మొదలు పెట్టాడో లేదో.

"ఏమిటీ కలెక్టరు మొగుడ్ని వదిలేసి కాలేజి లెక్చరరుని ప్రేమించిందా - అభిరుచి దారిద్ర్యం, బాడ్ టేస్ట్!" జడ్జిగారు నవ్వుతూ అన్నారు.

"ప్రేమంటే అదేనండీ, మీ టేస్టులూ, టోస్టులూ సభ్య ప్రపంచానికి మీరు పెట్టుకున్న గుర్తులు. ప్రేమ మరో ప్రపంచానికి సంబంధించింది. ఆ ప్రపంచంలో ఇవన్నీ సిల్లీగా కనిపిస్తాయి" ప్రేమగురించి క్షుణ్ణంగా పరిశీలించి థీసిస్ వ్రాసి డాక్టరేట్ తెచ్చుకున్నట్లు డాక్టరు అన్నాడు.

"ప్రేమకోసం రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య సింహాసనాన్నే కాలదన్నాడు విండర్స్ ప్రభువు. రోమియో కోసం జూలియట్ ఆత్మత్యాగానికే సిద్ధపడింది. అంతకంటె

గొప్ప ఉదాహరణలు ఏం కావాలి సార్" చిన్నప్పుడు చదువుకున్న వాటి ఆధారంగా అన్నాడు డి. యస్. పి.

ఆనందరావు చిరునవ్వు నవ్వాడు. అంతలోనే ఉత్తేజితుడై "ఆ ప్రేమకోసం అందుకే ఆమె ఆస్థి, అంతస్థు, హోదా, భర్తని, ఆఖరికి కన్నబిడ్డల్ని కూడా వదిలేసింది" ఆవేశంగా అన్నాడు.

"ఇదే నాకు నచ్చలేదు, ఆనందరావుగారూ, ఎవరయినా కన్నతల్లి కన్నబిడ్డల్ని కూడా ప్రేమకోసం వదిలేయడం అన్నది మాతృత్వానికే మచ్చకాదా ?" జడ్జిగారు అసంతృప్తి వెల్లడించారు.

"మీరు మాతృత్వాన్ని దృష్టిలో పెట్టుకు ఆలోచిస్తున్నారు. ప్రేమికుల్ని దృష్టిలో పెట్టుకు చూడాలి. అయినా పూర్తిగా వదిలేసిందని, మమకారం చంపేసుకుందని ఎందుకనుకుంటారు... నన్ను ముందు చెప్పనీయండి..."

"సరే, సరే చెప్పండి"

"ఆమెభర్త అక్కడ కలెక్టరుగా వుండేవాడని అన్నాను కదా. మన హీరో అక్కడే కాలేజీలో లెక్చరరుగా ఉండేవాడు. ఓ సారి అతని కాలేజీ ఏన్యువల్ ఫంక్షన్‌కి, కల్చరల్ వీక్‌కి కలక్టరుగారిని ప్రిసైడ్ చేయడానికి, మిసెస్‌ని ప్రైజు డిస్ట్రిబ్యూషన్‌కి రావాలని కాలేజీ తరుఫున ప్రిన్సిపాల్‌తో కలిసి ఇంటికి వెళ్ళాడు. ఆమెను చూడడం అదే మొదటిసారి అతను. డ్రాయింగు రూములో కూర్చున్న రెండు నిమిషాలకి లోపల్నించి వచ్చి ఆమెను చూసిన మన హీరోగుండె ఒక్కక్షణం లయ తప్పింది. ఎందుకో ఒక్క

నిమిషం తడబడి పోయాడు. అతని ముప్ఫైఐదేళ్ళ జీవితంలో చాలామంది ఆడవాళ్ళనే చూసివుంటాడు. ఇంతమాత్రంఅందగత్తెలూ తటస్థపడి వుండవచ్చు. కాని ఈమెని చూసినప్పుడు కలిగిన అనుభూతి వేరు, అతని హృదయం చిత్రంగా స్పందించింది. తరువాత అక్కడ కూర్చుని మాట్లాడిన అరగంటలో ఆమె అందం, శీవితోపాటు ఆమె నిగర్వితనం, మాటల్లో సింప్లిసిటీ అతన్ని బాగా ఆకట్టుకున్నాయి. ఆ రాత్రిఅంతా అతని ఆలోచనల్లో ఆమె నిండింది. చాలాసేపు నిద్ర పట్ట లేదు అతనికి. అతనికి తెలియకుండానే ఆమె వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ తరువాత కాలేజీ ఫంక్షన్‌లో ఆమెని మరింత నిశితంగా గమనించడానికి, ఆమె ప్రతి కదలికని ఆరాధన దృష్టితో చూడడానికి, ఆమెతో మరింత చనువుగా మాట్లాడడానికి అతనికి అవకాశం కలిగింది. ఆమెకూడా ఇతనితో మరికాస్త చనువుగా మాట్లాడింది. అతనిపట్ల ఇంటరెస్ట్ చూపిస్తూ ఏవేవో అడిగింది. ఇంటికి అప్పుడప్పుడు వస్తుండమంది. భార్యని తీసుకురమ్మని స్నేహపూర్వకంగా ఆహ్వానించింది.

అలా ఆరంభించిన పరిచయం- తర్వాత రెండుమూడు నెలల్లో మంచి మైత్రిగా మారింది. మన హీరో వాళ్ళింటికి రాకపోకలు మొదలు పెట్టాడు. అప్పుడప్పుడు భార్యని వెంట పెట్టుకుని వెళ్ళేవాడు. వీళ్ళు రెండుసార్లు వెళ్ళాక ఆవిడ కారేసుకుని వాళ్ళింటికి వెళ్ళింది. క్రొత్తగా ఆ ఊరొచ్చిన ఆమెకి అట్టేమంది పరిచయస్థులు లేరేమో, అందులో మన హీరో మంచి మాటకారేమో, ఆవిడ ఇతనితో స్నేహానికి

చాలా సంతోషించింది. ఆమె అంతస్థు అతనికంటె పెద్దదే అయినా స్నేహానికి అదో అడ్డు అనిపించలేదు.

రోజులు గడుస్తున్నకొద్దీ, ఒక్కొక్కసారి కలయికతో అతను ఆమెపట్ల మరింతగా ఆకర్షితుడవసాగాడు. అతని ఆలోచనల్లో ఆమె తప్ప మరో విషయం చోటుచేసుకోడం మానేసింది. అతని స్థితిఏమిటో అతనికే తెలియని స్థితిలో కొన్నిరోజులు గడిచాయి."

"మరి కలక్టరుగారో, ఆయనకి వీళ్ళస్నేహం, ఇతని రాకపోకల గురించి ఏం తెలీదా ?" పురుషోత్తం అనుమానంగా అడిగాడు.

"తెలియక పోవడం ఏం ?... వీళ్ళ ప్రేమ వ్యవహారం తెలియదుగాని మన హీరో వాళ్ళింటికి వెళ్ళడం, భార్య అతనింటికి వెళ్ళడం అన్నీ తెలుసు. వాళ్ళసంభాషణలో ఓ పది నిమిషాలు కూర్చుని "మా ఆవిడవుంది, ఆమెతో మాట్లాడుతూండండి. నాకు కాస్తపనుంది" అంటూ ఆఫీసు రూములో దూరేవాడు శలవపూటకూడా ! అంచేత కలక్టరుగారితో ఏదో రెండు మాటలు మాట్లాడే పరిచయంతప్ప పెద్ద స్నేహం ఏర్పడలేదు, మన హీరోకి ?"

"ఇచ్చుటకాస్త కలక్టరుగారి శీలపరిశీలన సెలవిండు" అన్నాడు డాక్టరు అచ్చ తెలుగులో హాస్యంగా.

ఆనందరావు నవ్వాడు "పాపం ఆయన మనిషేం అంత చెడ్డవాడు కాదు. అయితే బొత్తిగా 'రూల్సుమనిషి' 'స్ట్రిక్టు మనిషి' 'చండ శాసనుడు' వగైరా బిరుదులన్నీ అతనికి

ఆఫీసులో ఉన్నాయి. అతనికి ఆఫీసే ఇల్లు! ఆఫీసుపనే అతని హాబీ. టూర్స్ వెళ్ళడం మీటింగ్‌లకి ఎటెండ్ అవడమే అతని ఎంటర్‌టయిన్‌మెంట్సు. ఆఫీసు ఫైళ్ళు, చార్జిషీట్లు, ఎక్స్‌ప్లనేషన్స్ ఇదే అతని లోకం. ఓ సినిమాలు, స్నేహితులు, పుస్తకాలు, షికార్లు, క్లబ్బులు ఇవి ఆయనకి పట్టని సంగతులు! ఆయనకి భార్య, ఇల్లు గుర్తువచ్చేది భోజనానికి, నిద్రకి మాత్రమే! ఆ భోజనం కూడా పెళ్ళాం పెట్టినా ఒకటే, వంటవాడు పెట్టినా ఒకటే. వేళకి ఎదురుగా ఉండా అన్నదే ముఖ్యం. భార్యతో మాట్లాడే మాటలు కూడా ఆఫీసు మాటలు తప్ప ఇతర విషయాలు ఆయనకి కనపడవు. రూల్సు, స్ట్రిక్ట్‌నెస్, డిసిప్లిన్ ఆఫీసులోనే కాదూ-ఇంట్లోనూ అక్షరాలా పాటించేవాడు. ఇంటిలో నౌకర్లే కాదూ, కట్టుకున్న భార్యకి ఒకటే రూల్సు. అందరికీ ఆయనంటే భయం తప్ప భక్తి ఎవరికీ లేదు. ఆయన ఎంత స్ట్రిక్ట్ మనిషో చెప్పటానికి ఇన్ని మాటలక్కర లేదు. ఒక్క ఉదాహరణ చెబితే అర్థం అవుతుంది. వాళ్ళ పదేళ్ళ అబ్బాయిని, ఎనిమిదేళ్ళ అమ్మాయిని ఇంటిలో వుంటే సరిఅయిన డిసిప్లిన్ వుండదని, పాడయిపోతారని బోర్డింగ్ స్కూల్లో ఇద్దరిని పెట్టేశాడు. పాపం భార్య ఇద్దరు చిన్న పిల్లల్ని వదిలివుండ లేనని గోల పెడితే, పిల్లల భవిష్యత్తు ఆలోచించి అలవాటు చేసుకోక తప్పదని, కొన్ని మమకారాలు చంపుకోవాలి అంటూ ఉపన్యాసం ఇచ్చేవాడు. పాపం మొగుడి సంగతి తెలిసి ఆవిడేం చేస్తుంది. మొదట్లో బాధ పడేది. తరువాత ఆవిడకే అలవాటయిపోయింది."

"భలే మనిషిలా వున్నాడే, కన్నపిల్లలమీద కూడా అంత రూల్సు, రెగ్యులేషన్సూనా ?"

"పాపంఆవిడ ఆ లంకంతబంగళాలోఒక్కర్తె బిక్కు-బిక్కు మంటూవుండేది.అక్కడికీ ఏవో క్లబ్బుల్లో జాయిన్ అయింది. ఎవరోఆఫీసర్ల భార్యలు వస్తూండేవారు. పుస్తకాలు చదివేది. యెన్ని చేసినా పిల్లలన్నాలేని ఆ ఇల్లు, ఇల్లుపట్టకుండా తిరిగే భర్తతో కాపరం ఎంతో వంటరిగా ఫీలయ్యేది ! అంత విశాలమైన జీవితం ఆమె వంటరితనాన్ని మాటి మాటికీ గుర్తు చేసేది. బంగళా, సోఫాలు, ఫ్రిజిడేర్లు, కారు, హోదా గల భర్త-ఆమె అదృష్టానికి లోకం అసూయపడవచ్చు... కాని ఆమె అంతరాంతరాలలోని వెలితి, పైకి నవ్వుతూ తిరిగే ఆమె మనసులోని నిర్లిప్తత, నిస్తేజం మామూలుగా చూస్తే ఎవరికీ అర్థంకావు ! ఆమెకి అన్నీవున్నాయి... కాని ఆమెకి కావల్సింది ఆ ఇంటిలో దొరకలేదు. చీరలు, నగలు, కోరినంత డబ్బు ఇచ్చే భర్తవున్నాడుగాని... వీటన్నింటిని మించిన అనురాగం, ఆప్యాయత, ఆదరణ, ప్రేమ ఇవి ఆమెకి ఆ ఇంటిలో కరవయ్యాయి."

"ఐ పిటీ హర్... అందుకే లేచిపోయినట్టుంది ఇంటి లోంచి..." డాక్టరు అన్నాడు.

"అన్నింటికంటె ఐరనీ ఏమిటంటే, పాపం ఆమె మన హీరోతో ప్రేమలో పడేవరకు తను తన జీవితంలో ఏది పొందలేకపోయిందో, ఏం నష్టపోయిందో, ఆ నిర్లిప్తత, అది దేన్నించోకూడా అర్థం చేసుకోలేని అయోమయస్థితిలో వుంది. తను తన పదేళ్ళ వైవాహిక జీవితంలో ఏం పొంద

లేకపోయిందో అతని ప్రేమ పొందాకే గుర్తించింది. జీవితానికి అర్థం సోఫాలు, బంగళాలు మాత్రంకాదని గుర్తించింది. అందుకే తనని ప్రాణంగా ప్రేమించి ప్రేమకినిర్వచనం తెలియ చెప్పిన ఆ కాలేజీ లెక్చరరుకి తనని తాను సంతోషంగా అర్పించుకుంది. అప్పటివరకు నష్టపోయిందెంతో గ్రహించాక ఇంక ఆమె ఆలస్యం చెయ్యలేదు."

"అదిసరేగాని, వాళ్ళిద్దరూ ప్రేమించుకున్న సంగతి ఒకరికొకరు ఎలా చెప్పుకున్నారు? అసలెప్పుడు తెల్సుకున్నారు.... తెల్సుకున్నాక ఆవిడ ఇల్లెప్పుడు విడిచి పోయింది?"

ఆనందరావుకి ఆ ప్రశ్న వింటే నవ్వువచ్చింది... "ప్రేమించుకున్నవాళ్ళకి ఎలా తెలియడం ఏమిటండీ! మన హీరో అయితే మూడు నాలుగు నెలలకే పిచ్చెత్తిపోయినట్లయ్యాడు. ఆమెని చూడకుండా ఒక్కరోజుకూడా వుండలేని స్థితి, ఆమె మాటవినకుండా ఒక్కపూట వుండలేనిస్థితి, కళ్ళు తెరిచినా మూసినా, రాత్రి, పగలు ప్రతినిమిషం కళ్ళముందు ప్రత్యక్షమయే ఆమెరూపం,ఆమెమాటలు వినపడడం వీటన్నింటికి అర్థం ఏమిటో అతనికి చాలా తొందరలోనే అర్థం అయింది. తనస్థితి అర్థంఅయ్యాక ఆమె అభిప్రాయం ఏమిటో గ్రహించడం ఎలాగో అర్థంకాలేదు. పెళ్ళయి, పిల్లలతల్లిని, సంఘంలో పరువు హోదాలో వున్న ఓ స్త్రీ విషయంలో తొందరపడితే, ఆమెకా అభిప్రాయం లేకపోతే ప్రమాదం అన్నది అతని సమస్య!

"ఆమె మాటలు, భావాలద్వారా ఆవిడఅభిప్రాయం గ్రహించాలని తాపత్రయపడేవాడు. చూస్తూంటే ఆమె కూడా తనపట్ల ఆకర్షితురాలయినట్లుఅతనికనిపించేది. అతను మాట్లాడుతూంటే చాలా ఇంటరెస్టింగ్‌గా వినేది. అతను వేసే ప్రతీజోక్‌కి మనసారా నవ్వేది! అతను ఏదన్నా చెప్తూంటే అతని మాటల్లో లీనమై తదేకంగా అతని మొహంలోకి చూస్తూ మైమరచినట్లుండేది. ప్రతీరోజూ అతన్ని రమ్మనేది. "మీరు వచ్చాక, మీ స్నేహం కలిశాక నాకు కాలక్షేపంగా వుంది. మీతో మాట్లాడడం నాకు సంతోషాన్నిస్తూంది. ప్రతి రోజూ రావాలి మీరు" అంటూ అర్థించేది. ఏ రోజన్నా అతను రాకపోతే కాలేజీకి ఫోనుచేసేది. లేకపోతే ఇంటికి ప్యూన్ని పంపేది. అదీకాకపోతే డ్రైవర్ని కారు తీసికెళ్ళి తీసుకురమ్మనేది. అతనురాగానే ఆమె మొహం సంతోషంతో వెలిగేది. ఆరాటంగా ఎదురొచ్చి అభిమానంగా పలకరించేది. అలా గంటలకి గంటలు ఇద్దరూ పిచ్చిపిచ్చిగా ఏదో మాట్లాడుకుంటూ కూర్చునేవారు. ఆమె అలంకరణలో ప్రత్యేకత కనపడడం ఆరంభించింది. వీటన్నింటి దృష్ట్యా తన మీద ఆమెకి కూడా ఇంటరెస్ట్ పెరుగుతూందని గ్రహించాడు అతను. కాని... ఆ ఇంటరెస్ట్ కేవలం స్నేహమో, మరోటో తేల్చుకోలేకపోయాడు! అతను ధైర్యంచేసి ముందడుగు వేయడానికి జంకసాగాడు. ఇలా ఓ మూడు నాలుగు నెలలు గడిచిపోయాయి. మన హీరో పూర్తిగా పిచ్చివాడయ్యాడు. ఆఖరికి... ఆఖరికి—ఓ రోజు..."

"ఏమయింది ?" నలుగురూ ఒకేసారి ఆరాటంగా అడిగారు.

"ఓ రోజు సాయంకాలం మామూలుగా ఆమె ఇంటికి వెళ్లాడు హీరో. ఆ రోజు కలక్టరుగారు ఊళ్ళో లేరు. ఆమాట ఈమాట చెప్పుకుంటూ తోటంతా తిరిగారు ఇద్దరూ. సాయంత్రపు వెలుగులో చక్కగా విరిసిన పూల సువాసనల మధ్య ఆమెని చూస్తూ మత్తెక్కిపోయాడు హీరో. ఇద్దరూ అలా కాసేపు తిరిగి ఫౌంటెన్ ప్రక్కన కూర్చున్నారు. మసక చీకటి పడింది. ఎప్పుడువచ్చాడో మాలి వాళ్ళిద్దరినీ చూడకుండానే ఫౌంటెన్ తిప్పాడు. ఒక్కసారి నీరుచిమ్మి మాటల్లో మైమరచిన ఆమెని తడిపేసింది. ఒక్కసారి ఇద్దరూ తుళ్ళిపడ్డారు. సంభాషణ ఏదయితేనేం, తమ పరిస్థితి తన్మయత్వమని అప్పటికి వారికి అర్థమయింది. మాలిని తిట్టి చీరమార్చుకుందుకు లోపలికి వెళ్ళింది. అతను డ్రాయింగు రూములోకి వెళ్ళికూర్చున్నాడు. ఆమె ఎంతోసేపటికి వచ్చిందిమళ్ళీ. కాని చీర మార్చుకునే రాలేదు. శుభ్రంగా స్నానంచేసి, పల్చటి గులాబీరంగు చీరకట్టుకుని, లవెండర్ పరిమళంతో అప్పుడే వికసించిన గులాబీలా వచ్చింది. మసక చీకటినిచీల్చే పల్చటి దీపపు వెలుగులో ఆమెని చూడగానే అతనికి ముఖం తిరిగింది. బిత్తరపోయి ఆ సౌందర్యాన్ని చూస్తూ నిలిచిపోయాడు...

"ఏమిటలా చూస్తున్నారు !" అందామె కాసేపటికి.

ఆ మాటలు అతనికి వినిపించలేదు. ఆమె మనోహరంగా నవ్వింది. దిమ్మెరపోయి ఆమెనే గమనిస్తున్న అతని

వైపు రెండడుగులు వేసింది. ఆమె సౌందర్యపు పరిమళం అతన్ని చుట్టేసింది. అతనికి మైకం కమ్మినట్టయింది, తెలీని ఉద్రేకం ఆవరించుకుంది. ఉద్రేకంలో—అతను ఒక్కసారిగా ఆమె దగ్గిరికి వెళ్ళి ఆమె గుండెల్లో మొహంపెట్టి భోరు మన్నాడు.

ఆమె నిర్ఘాంతపోయింది. తెల్లపోయింది. "ఏమిటి ? ఏం జరిగింది ?" అంటూ మరింతదగ్గిరకి, మరింతగా వాళ్ళిద్దరి మధ్య దూరం లేనంత దగ్గరగా వచ్చింది. అప్రయత్నంగానే అతని చుట్టూ చేతులు వేసింది. అతన్ని కౌగిట్లోకి తీసుకుంది. ఆమె కౌగిట్లో అతనికిస్పృహ తప్పినట్లయింది. ఇద్దరూ ఎన్నో యుగాలు అలాగే ఉండిపోయారు..."

"విచిత్రంగా వుందే !... భరించలేని ఉద్రేకం—అది ఏదయినాసరే కన్నీరే ననుకుంటాను. భగవంతుని భక్తుడు చూసే పారవశ్యం. ప్రేయసి ఒడిలో ప్రియుడి తన్మయత్వం. పసివాడిపట్ల తల్లి వాత్సల్యం—అన్నిటికీ పర్యావసానం కన్నీళ్ళే !... భేష్! నిజంగా జరిగిందో మానిందో మాకవసరం. కాని వీరిద్దరి ప్రేమకి అతిరమ్యమైన రూపకల్పన చేశారు—" నిజంగా ఆ కథలో లీనమయిపోయి, కాస్తోకూస్తో కవి హృదయం వున్న డాక్టరు ఉత్తేజితుడై అన్నాడు.

"తరువాత ఏమయింది?" తొందరపెట్టారు డి. ఎస్. పి. గారు.

"అతని కౌగిలిలో ఆమె దీపం దగ్గరకి వచ్చిన మైనపు వత్తిలా అయిపోయింది. ఆమె గతజీవితం అంతా శూన్యంలా కనిపించింది. ఆమె కౌగిలిలో అతనికి భవిష్యత్తు

కాంతివంతమయితే, ఆమెకి గతంలో చీకటి కళ్ళకి కట్టింది. ఇప్పుడు భోరుమనడం ఆమె వంతయింది. పసిపాపలాగ అతన్ని అల్లుకుపోయి "నన్నిక్కడనించి ఎక్కడికన్నా తీసి కెళ్ళిపో. ఈ నరకంలో ఒక్క క్షణం నేనుండలేను. నిన్ను వదిలి బ్రతకలేను. నన్ను నీతో తీసికెళ్ళు. నీవు లేందే నిన్ను చూడందే నే బ్రతకలేకపోతున్నాను..." ఏదేదో వెర్రిగా అంటూ ఏడవడం ఆరంభించింది. తరువాత కొన్ని క్షణాలలో అతను తేరుకుని ఆమెని నెమ్మదిగా సోఫా దగ్గిరకి తీసికెళ్ళి కూర్చోపెట్టాడు. ఏడుస్తున్న ఆమెని బుజ్జగించాడు. సముదాయించాడు. ఓదార్చాడు. నీకు నేనున్నానన్నాడు. నీ బాధ ఏమిటన్నాడు. తన ప్రేమ వెల్లడించాడు. తానామె గురించి, ఆమె ప్రేమకోసం పడ్డయాతన చెప్పాడు. ఆమె అతనికోసం, అతని ప్రేమకోసం, సాంగత్యంకోసం పడ్డ ఆవేదన, ఆరాటం చెప్పింది. తనెంత ఒంటరిగా ఫీలవుతున్నదీ, తన జీవితంలో ట్రాజడీ, తనెలా సుఖపడలేకపోతున్నదీ అన్నీ బేలగా చెప్పి ఏడ్చింది. ఒకరి మనసు ఒకరికి విప్పి చెప్పుకున్నారు. అన్ని రోజులకయినా ఇద్దరూ ఒకరికొకరు మనసు విప్పి చెప్పుకోగలిగినందుకు ఆనందించారు..."

"తరువాత...తరువాత ఏమయింది?"

"తరువాత ఏముంది? ... తర్వాత ఓ సంవత్సరం పాటు వాళ్ళీ లోకంలో లేరు. వాళ్ళిద్దరికీ మిగతా లోకం కనపడ్డం మానేసింది. ఈ ఏడాదిలో వాళ్ళు ఒకరినొకరు వదిలి ఒక్క క్షణం కూడా బ్రతకలేనంత దగ్గిరగా వచ్చారు! కాని... కాని ఇద్దరూ శాశ్వతంగా ఎలా ఒకచోట వుండ

గలరు అన్నది వాళ్ళ సమస్య! కలక్టరుగారికి ఆ వూరు నుంచి ట్రాన్సఫర్ అవచ్చు. ఇతనికీ ఎప్పుడో తప్పదు! అప్పుడు...ఎలా? "నేను నీ వెంట వచ్చేస్తాను తీసికెళ్ళిపో. ఎక్కడికైనా సరే..." అందామె. అనడం అందిగాని భర్త, పిల్లలు, సంఘం, కట్టుబాట్లు యివన్నీ తెంచుకు బయట పడడం అంత సుళువా! అతనికి భార్యాపిల్లలు, ఈమెకి ఈ సంసారం ఎలా, ఎలా అన్న సమస్యతో, ఆలోచనతో, బాధపడిపోయారు. పోనీ ఆమె ఇంట్లోంచి లేచివచ్చేసినా అతను తన భార్యాబిడ్డల్ని ఏం చేస్తాడు? తననే నమ్ముకున్న ఆ భార్యకి ఎలా అన్యాయం చేస్తాడు? ఆమె గతి ఏమవుతుంది. ఇవన్నీ తెగని సమస్యలయి కూర్చున్నాయి.

"ఈ లోగా ఈ సమస్యలని వెంటనే పరిష్కరించవలసిన సమయం తీసుకువచ్చింది. వాళ్ళ మనసులు వేస్తున్న ప్రశ్నలకి వెంటనే జవాబులు వెతుక్కోవలసి వచ్చింది.

"అతనికి ఆ వూరునించి ట్రాన్స్ఫర్ అయింది ఆమె అతన్ని విడిచి బ్రతకలేనని ఏడ్చింది.

"నేను నీకు సంఘంలో నా భార్య స్థానం కల్పించలేను గాని, నా ప్రేయసిగా నా హృదయంలో నిన్ను దాచుకుంటాను. నిన్ను నా చేతనయినంతగా సుఖపెడతాను. నా మీద నమ్మకముంటే, నన్ను, నా ప్రేమని విశ్వసించి నాతో రాగలిగితే భవిష్యత్తులో నీకెన్నడూ విచారించి, పశ్చాత్తాపపడే పరిస్థితి రాకుండా చూసుకుంటానని వాగ్దానం చెయ్యడకంటె నేనేం చెయ్యను... నా ఇంట్లో నీకెప్పుడూ

స్థానం వుంటుంది. నన్ను నమ్మితే నా వెంటరా" అన్నాడతను. ఇద్దరూ చాలా ఆలోచించారు. మాట్లాడారు. ఆఖరికి ఆమె అతని వెంట వెళ్ళడానికే నిశ్చయించుకుంది."

"మరి అతని భార్య అంగీకరించిందా? ఆమె ఎంత మంచిదయినా ఇంట్లో యింకో ఆడదాన్ని భర్త తెచ్చి పెట్ట డానికి సహించిందా? ఆమెకి వీళ్ళిద్దరి సంగతులు ఏమీ తెలియవా?"

"ఆమెకి తెలియకపోవడం ఏమిటి? మొదట్లో తెలి యక పోవచ్చుగాని తర్వాత ఆమె గ్రహించింది. గ్రహించ నక్కర లేకుండానే భర్త స్వయంగా ఆమె గురించి చెప్పాడు. ఆమెని చూడకుండా, ఆమె లేకుండా బ్రతకలేనన్నేవాడు. ఆఖర్న ఆమెని ఇంటికి తీసుకొచ్చేముందు భార్యతో వున్న పరిస్థితి అంతా చెప్పాడు. తామిద్దరూ ఒకరినొకరు విడిచి వుండడం అసంభవమన్నాడు. అసలు ఆ విషయం అతను నోరారా చెప్పనక్కరలేకుండానే ఆమె అర్థం చేసికుంది. ఆమెని దూరంగా వుంచి భర్తని పిచ్చివాడిని చెయ్యాలా? భర్తకోసం ఆమెని అంగీకరించాలా? ఆమే ఆలోచించింది. అవతల ఆమె సంస్కారంగల వ్యక్తి! కోరిన మనిషికోసం, అతనిమీద ప్రేమతో తన సంసారాన్ని, పిల్లల్ని అన్నింటిని త్యాగంచేసి వస్తున్నప్పుడు తన త్యాగం అంత పెద్దది అని పించలేదు. భర్త ప్రేమని, అతని హృదయాన్ని సానుభూతితో అర్థంచేసుకుని అంగీకారం తెలిపింది ఇలా అయితే భర్త తన కళ్ళముందే ఎప్పుడూ వుంటాడు. ఆమెకూడా చాలా కలుపుగోలు మనిషి. తనతో కలిసిమెలిసిపోగలదు. యివన్నీ

ఆలోచించి ఆమె అంగీకరించింది. ఆఖర్న అతనా వూరు నుంచి వెళ్ళేటప్పుడు, ముందే చేసుకున్న ఏర్పాటు ప్రకారం కలక్టరుగారు వూళ్లో లేనప్పుడు ఇంట్లో ఉత్తరంరాసి పెట్టేసి ఇతనితో రైలెక్కేసింది ఆమె..."

"అబ్బ ఏం ధైర్యం ? చూస్తుంటే ఆమె చాలా గుండెధైర్యం గలదిలా వుంది ! తరువాత కలక్టరుగారు ఏమీ గొడవ చెయ్యకుండా వూరుకున్నారా ? లోకం ఎలావూరుకుంది..." ప్లీడరుగారికంతా ఆశ్చర్యంగానే వుంది.

"వెధవలోకం- ఈ లోకం ధనవంతుని ఏమీ అన లేదు- డబ్బు వెనుక నీతిని దాచుకోగలడు గనక- బీదవాడి జోలికిపోదు- వాడి నీతికీ సమాజానికీ సంబంధంలేదు కనక- ఈ లోకం పట్టి పీడించేది- దానివైపు భయం భయంగా చూసే మధ్యతరగతి మానవుడినే- అయినా ఎన్నాళ్ళు ఆడి పోసుకుంటుంది ? పదిరోజులు అంటుంది, నెల్లాళ్ళుఅంటుంది, రెండు నెలలు అంటుంది. లెక్క చెయ్యని వాళ్ళని ఏం చెయ్యలేక నోరు మూసుకుంటుది. అతనేం చట్టవిరుద్ధంగా మరోభార్యగా పెళ్ళాడలేదు. ఇంటిలో వుంది. ఆమె ఎవరో ఏమిటో ఆ మహాపట్టణాలలో పట్టించుకునేవారెవరు ? ఎవరో ఇరుగుపొరుగు అన్నా, అనుకున్నా వీళ్ళు లెక్క చెయ్యలేదు. ఏదో బంధుత్వం చెప్పేవారు. నమ్మినవాళ్ళు నమ్మారు. లేనివాళ్లు నవ్వుకున్నారు. గుసగుసలాడుకున్నారు. అంతకంటె ఏం చేస్తారు ? వెలేయడానికి ఇవేం పూర్వం రోజులుకావు. అతని తల్లిదండ్రులు, బంధువులు సంగతి తెల్సి చివాట్లు పెట్టారు, బుద్ధిచెప్పబోయారు. మందలిం

చారు. తరువాత రావడం మానేశారు. అతనన్నింటిని ఆఖ రికి తల్లిదండ్రులని సయితం లెక్క చెయ్యకుండా వదులు కున్నాడు ఆమెకోసం !"

"అతను సరే, కలక్టరుగారి మాట ?" డాక్ట రడి గాడు.

"ఆయన మాత్రం ఏం చేస్తాడు ? పెళ్ళాం లేచి పోయిందని నలుగురితో ఎలా చెప్పుకుంటాడు. పుట్టింటి కెళ్ళిందని కొన్నాళ్ళు చెప్పుకున్నాడు. ఆ తరువాత అక్కడే కారు ఎక్సిడెంటులో భార్య పోయిందని ఓ ఏడుపు ఏడి చాడు. రెండు నెలలు శలవు పెట్టి అక్కడనించి ట్రాన్సఫర్ చేయించుకున్నాడు. కోర్టులు కేసులు అయితే తన పరువు పోవడం మినహా ప్రయోజనం ఏంలేదని గ్రహించి వూరు కున్నాడు ... ఆ తర్వాత అతన్ని గురించి పట్టించుకున్న వాళ్లెవరు ? తర్వాత రెండు మూడు ఏళ్ళకి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని తెలిసింది."

"మళ్ళీ పెళ్లా ? ఓ పెళ్ళాన్ని సుఖపెట్టలేకపోయాక మరొక పెళ్ళాం ఎందుకు వాడికి ?" కోపంగా అన్నాడు డాక్టరు.

"బహుశా పెళ్ళాం వదిలేస్తే నాకు గతిలేదా ? అని చెప్పడానికి పౌరుషంకొద్దీ చేసుకునుంటాడు?" ఆనందరావు నవ్వి అన్నాడు.

"మరి ఆమె పిల్ల లేమయ్యారు ? ఆవిడ పిల్లలగురించి ఎప్పుడూ బాధపడేదికాదా ?"

"ఆమెకి ముందునించీ పిల్లల్ని వదిలి, ఏ శలవలకో, ఆర్నెల్లకోసారి చూడడం అలవాటు. అది యిప్పుడు ఆమెకి వరం అయింది. తనే ఆర్నెల్లకి ఓసారి బోర్డింగ్ స్కూల్ కి వెళ్ళి చూసి వస్తుండేది. మూడునాలుగు రోజులకో ఉత్తరం రాసేది. పిల్లలూ తల్లికి రాసేవారు ..."

"పిల్లలకి మరి తల్లి యింట్లోంచి వెళ్ళిపోయిన విషయం అవి ఏమీ తెలియవా ?"

"చిన్నపిల్లలప్పుడు తెలియదు. శలవలకి ఇంటికెళ్ళి నపుడు తల్లి అక్కడెందుకు లేదో ఏమిటో అర్థంకాక తల్లి తమని చూడడానికి వచ్చినపుడు అమాయకంగా అడిగే వారు. ఈమె ఏదో సర్ది చెప్పేది. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక అసలుసంగతిని విడమర్చి ఓరోజు ఇద్దరికిచెప్పింది.తల్లి బాధని అర్థంచేసుకున్నారు పిల్లలు. సానుభూతి చూపారు. ముందు నించి తండ్రి అంటే భయం తప్ప ఆయన అనురాగం ఎరగని ఆ పిల్లలు తల్లి చేసిన పనిని చాలా సులువుగానే క్షమించే శారు."

"మరి కలక్టరుగారికి యీావిడ ఇలా వచ్చి పిల్లల్ని చూస్తున్న విషయం అదీ తెలియదా ? దానికి ఆయన అభ్యంతరం ఏం చెప్పలేదా?"

"అసలావిడ వచ్చి చూస్తూందన్న విషయం ఆయనకి తెలీదు. పిల్లల్ని చెప్పవద్దనేది ఆమె. ఒకవేళ తెల్సినా ఆవిడ అక్కడకి వెళ్ళి చూడడాన్ని ఎలా అరికట్టుతాడు. పిల్లల్ని తల్లికి చూపద్దు అని స్కూలు ప్రిన్సిపాలుకి చెపితే

అసలు సంగతంతా బైటికి వస్తుందని బహుశా చల్లగా వూరుకుని వుంటాడు."

"మరి ఇతను! ... ఈ లెక్చరరు అలా ఆమెని వెళ్ళ డానికి దానికి ఏమభ్యంతరం చెప్పేవాడు కాదా?"

"ఛా. ఛా ... అతనేం మనిషికాడా? అతనికి కావ ల్సింది ఆమె మనస్ఫూర్తిగా అంగీకరించిన జీవితంకానీ, బల వంతంగా తనని చేసుకున్న మనిషికాదు. ఓ తల్లి హృద యాన్ని అర్థంచేసికోలేడా? అసలు అతనే ఆమెని పిల్లల్ని చూసి రమ్మని పంపేవాడు. వీలున్నప్పుడు అతనే వెంట బెట్టుకు వెళ్లేవాడు. పిల్లలకి ఏమన్నా కొని ఈయమనేవాడు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక కూతురి పెళ్ళయ్యాక ఆమె కూతు రింటికి వెళ్ళి పదిరోజులుండి వచ్చింది. అల్లుడు సహృద యుడు. సంస్కారి. నవీనుడు. భార్యద్వారా ఆమె సంగ తంతా విని సానుభూతి చూపాడు. ఆమె రాకపోకలకి ఎన్నడూ అభ్యంతరం చెప్పేవాడు కాదు. కూతురికి పురు డుకి వెళ్ళి నెల్లాళ్ళుండి వచ్చింది. కొడుకు ఉద్యోగంలో చేరాక తల్లి దగ్గరకే తిన్నగా రాకపోకలు సాగించేశాడు శలవలకి. పెళ్ళయ్యాక తల్లిని యింటికి పిలిచి కొన్నాళ్ళుం చుకు పంపుతూండేవాడు. వాళ్ళకి అవశల సవతితల్లి అవసరం వల్ల అన్నింటికి ఈమెమీదే ఆధారపడేవారు. వీటన్నింటికి మన హీరో ఎప్పుడూ అభ్యంతరం చెప్పకపోగా సంతో షంగా ఆమోదించేవాడు ... అంచేత పిల్లల్ని దూరంచేసు కున్నానన్న బాధ ఆమె ఎప్పుడూ పడే అవస్థ రాలేదు. అంచేతే ఆమె అతని దగ్గిర సంతోషంగా వుండగలిగింది."

"అవునుగానీ, ఒకే యింటిలో పెళ్లాన్ని, ప్రేయసిని పెట్టుకుని కాపురం ఎలా చేశాడయ్యా మహానుభావుడు? ఇద్దరాడవాళ్ళు అందులో సవతులు ఒకే ఇంటిలో వుంటూ కొట్టుకోకుండా ఎలా వున్నారు? ఎప్పుడూ దెబ్బలాటలు, కలతలు అవి రాలేదా వారిమధ్య? ముగ్గురూ అలా ఎలా ఎడ్జస్టు అవగలిగారు? ఒక పెళ్లాంనే భరించలేక చస్తున్నామే, ఇద్దరిని పెట్టుకుని ఎలా నెగ్గుకొచ్చాడో ఆశ్చర్యంగానే వుంది నాకు" డాక్టరుగారి సందేహం.

ఆనందరావు పకపక నవ్వాడు. "ఏముంది, వెరీ సింపుల్ ఇద్దరికిద్దరూ అతన్ని ప్రాణంగా ప్రేమించేవారు! అతనికి దూరమవడం ఇద్దరికీ యిష్టంలేదు. అతను కావాలంటే తామిద్దరూ కలిసి వుండడం అవసరం అన్నది ఇద్దరికీ తెల్సు! అంతేకాక ఇద్దరూ సహృదయులు! సంస్కారం వుంది. భర్త ప్రేమని ఇంకొకరిని పంచుకోనిచ్చిన భార్య సహృదయతకి ప్రేయసీ కరిగిపోయి ఆమెపట్ల కృతజ్ఞతతో వుండేది? ఇల్లు, వాకిలి, హోదా, ఐశ్వర్యం, పిల్లలని అన్నీ తన భర్తకోసం వదులుకు వచ్చిన సాటి ఆడదాన్ని అగౌరవపరచకుండా ఆమెని ఆదుకోవాలన్న సానుభూతి భార్యకి వుండేది. ఇద్దరికిద్దరూ చాలా బాగా కలిసిపోయారు. అన్ని విషయాలకి ఒకరి నొకరు అర్థం చేసికుంటూ, సలహాలు అడుగుతూ, పనిపాటల్లో కూడా ఒకరికొకరు చేదోడు వాదోడు అయ్యారు. ఒకరు అతనికి తలకి నూనె రాస్తే, మరొకరు బూట్లందించేవారు. ఒకరు బట్టలుతికితే, మరొకరు యిస్త్రీ చేసేవారు."

"బాగుంది కాని, పడక ఏర్పాటులు యెలా చేశా డయ్యా స్వామి. అక్కడయినా కనీసం దెబ్బలాటలు రాలేదా ? ఇద్దర్నీ చెరో ప్రక్కన పెట్టుకు పడుకునేవాడా ఏమిటి ?" డాక్టరు నవ్వుతూ అడిగారు.

ఆనందరావు నవ్వాడు. "దానికి మాత్రం ఇబ్బందే ముంది ? ఆరాధన ప్రాతిపదిక అంగీకరించిన జీవితాల్లో శరీరాలు అడ్డురావనుకుంటాను. అది ముగ్గురికీ తెలుసు. ముగ్గురూ సంస్కారవంతులు. అందరికి ఒకేసారి ఆకలి వెయ్యా నక్కరలేదు. అవసరాన్ని అదనుగా పంచుకోడం మూాంగ గానే ఏర్పాటు చేసుకున్నారు వాళ్ళు. భార్యతో అతను ఆప్యాయంగా మాట్లాడే సందర్భంలో మనస్ఫూర్తిగా అక్కడనించి ప్రక్కగదిలోకి వెళ్ళిపోయేది ప్రేయసి. ఆమెతో చొరవగా వుండే సమయంలో ఆనందంగా దూరం వెళ్ళేది భార్య.."

"ఏం అదృష్టం ! ఐ యన్వీ దట్ ఫెలో...రోజుకో ళ్ళన్న మాట. భలే ఛాన్సు కొట్టాడు మహానుభావుడు... సేవలు చేయడానికిద్దరు, పడుకోడానికి ఇద్దరూ. ఏంఅదృష్టం." అసూయగా అన్నాడు జడ్జి.

"గమత్తేమిటంటే... భార్య పడుకొన్నరోజు "పాపం సత్యఒక్కర్తీ ఉన్నదండీ" అనేది. "అయ్యోపాపం రుక్కు వంటరిగా ఫీలవుతుందో ఏమిటో అనేది" ప్రేయసిసమీపాన వున్నప్పుడు..."

"ఇదేదో చాలా వింతగా వుంది, ఇద్దరాడవాళ్ళు ఇలా ఇంత అన్యోన్యంగా వుండడం ఎక్కడా వినలేదు.

ఇదేదో కథలో తప్ప ఇలా జరగదు సార్ నేన్నమ్మను..."
అన్నాడు డాక్టరు దృఢంగా.

"నమ్మకపోతే మానేయండి. నిజంమాత్రం ఇదే. మీరసలు వాళ్ళని చూసినాకూడా యింట్లో అంత కలివిడిగా వుంటారంటే నమ్మలేరు. కాని నిజం మాత్రం ఇదే."

"ఇదేనిజంఅయితే ఆ భార్యకి చెయ్యెత్తి దండం పెట్టా లంటాను. మరోఆడదాన్ని తనకాపురంలోకి రానిచ్చి భర్తని ఆమెకి పంచి ఇచ్చిన ఆ ఇల్లాలు మనిషికాదు దేవత అంటాను..." ప్లీడరుగారు ఆవేశంగా అన్నారు.

"నో...నో... ఆ క్రెడిట్ అతని కీయాలంటాను నేను. మగవాడిని బట్టి వుంటుంది. ఆ ఇద్దరాడవాళ్ళు అలా వున్నా రంటే వాళ్ళిద్దరినీ అలా వుంచిన అతని సామర్థ్యాన్ని మనం మెచ్చుకోవాలి" డాక్టరన్నాడు.

"అదీ ఒక విధంగా నిజమేలెండి.. అతను ఇద్దరికీ ఎవరికీయాల్సిన స్థానం వాళ్ళకిచ్చాడు. హెచ్చుతగ్గులు లేకుండా అన్నింట్లో సరిసమానంగా చూసేవాడు. అంచేత వాళ్ళలోవాళ్ళకి అసూయా ద్వేషాలకి స్థానంలేకపోయింది.. ఒక్కసారి మాత్రం ఏదో చిన్న గొడవ జరిగింది. ఓరోజు అతని భార్యా, ప్రేయసీ వచ్చిన కొన్నాళ్ళకి ఏదో మాటా మాటా అనుకున్నారు. ప్రేయసి ఏడుస్తూ పడుకుంది. పెళ్లాం మూతిముడుచుకు కూర్చుంది. అతనింటికి వచ్చేసరికి వున్న పరిస్థితిని చూశాడు. సంగతి అర్థమైంది. అతనేమీ అనలేదు. అడగలేదు ఇద్దరిని. భార్య తననితాను సమర్థించుకుంటూ

ఏదో చెప్పబోయింది. అతను ఊ ఆ అనలేదు. ఆ తరువాత ప్రేయసి తన నిర్దోషిత్వం నిరూపించుకోపోతే అదీ వినలేదు. తన గదిలోకి వెళ్ళి ఉలుకు పలుకు లేకుండా మంచం మీాద పడుకున్నాడు. అలా పడుకున్నవాడు ఒకటిన్నరరోజు పచ్చి మంచినీళ్ళు ముట్టుకోలేదు. భార్య, ప్రేయసీ హడలి పోయారు. బ్రతిమిలాడారు, ఏడ్చారు, తప్పయిందన్నారు. ఏం చేసినా అతను ఉలకలేదు, పలకలేదు. రోజున్నర అలా ఏం తినకుండా, మాట్లాడకుండా వున్నాక ఇద్దరూ అతని దగ్గర కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకుని ఇంకెప్పుడూ అలా ప్రవర్తించమని మాటిచ్చారు. అతనిమీాద ప్రమాణం చేయించుకున్నాకగాని అతను పంతం విడవలేదు. తరువాత అతనన్నాడు. "మీారిద్దరూ నాకు కావల్సినవాళ్ళు ఇద్దరిలో ఏ ఒక్కరూ ఒకరిమీాద ఒకరు చెప్పినా నేనెటూ చెప్పలేను. నామీాద ఏ మాత్రం ప్రేమ, గౌరవంవున్నా మళ్ళీ ఇలాంటి పరిస్థితి ఎదురవకూడదు" అంటూ ఇద్దరి దగ్గరా మాట తీసుకున్నాడు. అతనిమీాద గౌరవంఅయితేనేం, మళ్ళీ ఉపవాసాలు ఆరంభిస్తాడన్న భయం అయితేనేంగాక ఆ రోజునించి వాళ్ళిద్దరూ ఎన్నడూ మాట మాట అనుకోలేదు."

"నిజంగా బలేవాడండీ మీా హీరో. గాంధీగారి సూక్తుల్ని ఆఖరిని సంసారిక జీవనానికి చక్కగా అన్వయించుకున్నాడన్నమాట. పెళ్లాల్ని ఎలా అదుపులో పెట్టుకోవాలో ఆ మహానుభావుడ్ని ఓసారి దర్శించి అడుగుతే బాగుండును." జడ్జిగారి ఆరాటం.

"మీరు ఎంతసేపూ హీరోని, భార్యని పొగుడుతున్నారు. ప్రేయసి సంగతి మరిచిపోయారు. ఆమె చేసిన త్యాగం మీరెవరూ గుర్తించినట్లు లేదు. ఇల్లు, వాకిలి, హోదా, భార్య, తల్లిస్థానాలు అన్నీ వదిలేసుకుని సంఘంలో అనామికగా, ఓ ఇల్లాలిగా, తల్లిగా ఏ గుర్తింపు గౌరవం లేకుండా అతని దగ్గిర కేవలం ప్రేమకోసం వున్న ఆమెని తల్చుకుంటే నాకు చాలా జాలితోపాటు, చాలా గౌరవం కూడా కల్గుతుంది" ఆనందరావు ఆవేశంగా అన్నాడు.

"అఫ్‌కోర్స్, ముగ్గురికి ముగ్గురు చెప్పుకోదగ్గవాళ్ళే! ఓ ఆడదాన్ని ఇంట్లోంచి లేవదీసుకొచ్చి మోజుతీరగానే ఆమె ఖర్మానికి ఆమెని వదిలివేయకుండా ఇన్నాళ్ళకీ వున్న అతని ప్రేమని, ప్రేమకోసం అన్ని కాలదన్నుకుని వచ్చిన ప్రేయసీ, భర్త ప్రేమని అర్థం చేసికుని మరో ఆడదానికి భర్తని పంచియిచ్చిన భార్య. ఓహ్, ముగ్గురూ మనుష్యులు కారంటాను." డాక్టరుగారు చాలా ఉత్తేజితుడై అన్నాడు.

"దేవతలన్నమాట!.. దేవతల కథన్నమాట ఇది." జడ్జిగారు నవ్వారు.

"దేవతలా?– ట్రాష్! నాకు వాళ్ళ ఉనికిమీద నమ్మకం లేదు. కాని ప్రకృతి ఊహించలేని విజయాన్ని సాధించాడా హీరో– ఇన్‌షార్ట్ ఒకేరెమ్మని రెండుపువ్వుల్ని పూయించి రికార్డు స్థాపించాడంటాను" డి. ఎస్. పి. అన్నాడు.

"అవునుగాని సార్...ఈ కథ నిజం కథ అంటున్నారు.. మీకెలా తెల్సింది యీ కథ?" ప్లీడరుగారి అనుమానం.

ఆయన ప్రశ్న నోట్లో వుండగానే... లైట్లు గప్పున వెలిగాయి.

ఆనందరావు మొహం ఆ వెలుగులో అరక్షణం ఎర్రబడింది. "ఆ హీరో నాకు చాలా క్లోజ్ ఫ్రెండులెండి. అతని కథంతా ఓసారి చెప్పాడు..." అన్నాడు టేబిల్ మీద పేక ముక్కలు అన్నీ కలిపి సర్దుతూ.

"ఎంత ఫ్రెండయినా...యిన్ని సంగతులు చెప్పాడా?" డాక్టరు అనుమానంగా చూస్తూ అన్నాడు.

"అన్నీ అతను చెప్పాడని ఎందుకనుకోవాలి...మన ఆనందరావు ఓ కొస అందిస్తే అలా అల్లుకుపోగలడని తెలిసే సిల్లీ ప్రశ్నలు వేస్తే ఎలాసార్" అన్నాడు డి. ఎస్. పి. కుర్చీలోంచి లేచి "ఇందులో మన రావుగారి కవిత్వం ఎంతో మనకేం తెల్సుసార్..."

"కరెక్ట్ సార్. బాగా కనిపెట్టారు" ఆనందరావు నవ్వి కుర్చీ వెనక్కి నెట్టి లేచినిల్చున్నాడు.

"ఏదోలెండి, పేకాటలేనందుకు కాలక్షేపానికి మంచి కథ చెప్పారు... పది అయింది అప్పుడే... టైముకూడా తెలియలేదు కథలోపడితే... దీని దుంపతెగ ఇంకా వర్షం పూర్తిగా తగ్గందే... జల్లు పడుతూనేవుంది" పురుషోత్తం దిగులుపడ్డాడు.

"డోంట్ వర్రీ ఐ విల్ డ్రాప్ యూ...పదండి. చిన్న జల్లేలెండి. ఇంకెంతసేపు కూర్చుంటాం. యీ వర్షం తగ్గేదాన్లాలేదు..." ఆనందరావు బయలుదేరాడు.

*       *       *

ఆనందరావు ఇల్లు చేరేసరికి జల్లు బాగా నేపడ్తూంది. కారు హారన్ వింటూనే మాధవి గొడుగేసుకుని గబగబ వెళ్ళి గేటు తెరిచింది. గారేజి తలుపు తెరిచి పట్టుకుంది... కారులోపల పెట్టి లాక్ చేస్తూనే "తలుపు తెరుచుకునే వాడి నిగా. నీ వెందుకు వర్షంలో తడిసి వచ్చావు మధూ." వర్షపు జల్లుకి తడిసిపోయిన చీర చూస్తూ భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా అన్నాడు ఆనందరావు.

"వర్షం పడుతూంది. కారుదిగి తలుపు తీ...గా తడిసిపోవూ. అదిగో తడిసినట్టున్నావే, అక్కడ ఎక్కేటప్పుడు తడిసిపోయినట్టున్నావు" అతని తల తడిమిచూస్తూ అంది మాధవి ఆదుర్దాగా.

"కాస్త తడిస్తే పరవాలేదులెద్దూ... ఏం కొంప మునగదులే." "నీకేం నువ్వలాగే అంటావు. పద... పద... బట్టలు మార్చుదువుగాని." అతని భుజం పట్టుకున్న మధుని దగ్గిరకు లాక్కుని చెవిలో అన్నాడు. "మధూ... వాతావరణం బాగుందికదూ... చలిచలిగా... ప్రక్కనున్న...." మాధవి అతని కళ్ళలోకి చూసి నవ్వింది.

"బాగుంది, కారు షెడ్డులో సరసం. ఏళ్ళు వస్తున్న కొద్దీ మరీ చిన్నపిల్లాడివి అవుతున్నావు." అతని చెంపలు పట్టుకు ఊగిస్తూ అంది.

"ఏళ్ళు! వెధవ ఏళ్ళు. ఇన్నికాదు. మరిన్ని వచ్చినా నిన్ను చూస్తుంటే నేనెప్పుడూ పాతికేళ్ళవాడిలాగే ఫీలవుతాను. నీవెప్పుడూ నాకు నిత్య నూతనంగానే వుంటావు. నీకు, నాకు-వయసు శరీరాలకి రావచ్చు కాని, మన ప్రేమకి

ఎప్పుడూ వయసు మళ్ళదు మధూ." ఆనందరావు మాధవిని దగ్గరికి హత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"చాల్లే కవిత్వం. పద లోపలికి. సుశీ వరండాలో నిల్చుంది.. చూస్తూంది మనకోసం" అంది- ఆనందరావు మాధవి భుజంచుట్టూ చెయ్యేసి గొడుగులో దూరి నడిచాడు.

వరండాలో ఆదుర్దాగా చూస్తున్న సుశీల గాభరాగా ముందుకి వస్తూ "తడిసిపోయారా... అయ్యొయ్యొ... అను కుంటూనే వున్నాను, వెధవ వర్షం పట్టుకుని వదిలితేనా..."

"అరె, నేను ఎలాగో తడిశాను. నువ్వెందుకు తడుస్తావు. నే వస్తున్నాగా... అయినా కాస్త వర్షంలో తడిస్తే నీ మొగుడేం మొక్క మొలవదులే" అన్నాడు ఆనందరావు.

"అవునవును, మీకేం అలాగే అంటారు. రేపొద్దుటికి దగ్గు, జలుబు, ఆస్మా, ఆయాసం అన్నీ పట్టుకుంటే బాధెవరికి. ముందా బట్టలు విప్పండి... మధూ ఏమిటి అలా చూస్తావు. తువ్వాలు తీసుకురా, తల తుడుస్తాను" గాభరా పడింది సుశీల.

"అబ్బబ్బ ఏమిటలా నీవు గాభరాపడి, నన్ను పెడ్తావు... అట్టే ఏం తడవలేదులే. ఆ తువ్వాలిలా తే... బట్టలు మార్చుకు వస్తానుండు." అన్నాడు ఆనందరావు.

"బట్టలు మార్చుకునేముందు కాస్త అద్దం చూసుకుని ఆ బుగ్గమీద కుంకం కాస్త తుడుచుకోండి." అంది సుశీల ముసిముసి నవ్వులు నవ్వుతూ మాధవివైపు చూస్తూ.

మాధవి క్రొత్తపెళ్ళికూతురిలా సిగ్గుపడింది.

సుశీలని అటు వెళ్ళనిచ్చి— ప్రక్కనించే వెడ్తున్న ఆనందరావు భుజంగిల్లి— "చూశావా నీ కొంటెతనం?— అక్కయ్య కనిపెట్టేసింది" అంది చిలిపిగా.

"శుభం!— ఇంక రహస్యం ఇనప్పెట్టెలో దాచినట్టె. ఆ బుజం వదిలితే బట్టలుమార్చుకు వస్తాను" అన్నాడు ఆనందరావు నవ్వి.

"తొందరగా రండి అన్నం, చారు అన్నీ వేడిచేస్తున్నాను... ఆలస్యం అయింది. పదిన్నర అవుతూంది. భోంచేద్దాం" వంటింట్లోంచి సుశీల కేక పెట్టింది.

"మీరూ భోంచెయ్యలేదా?"

"నీవు లేకుండా ఎప్పుడన్నా మేం తిన్నావేమిటి, క్రొత్తగ అడుగుతున్నావు" తల తుడుస్తూ అంది మాధవి.

"ఇంతాలస్యం అయింది గదా, నాకోసం ఎందుకు వెయిట్ చెయ్యడం చెప్పండి..."

"సరే పద. నీకన్నీ కొత్తే—వింతే" ముగ్గురు డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు. "ఇవాళ ఓ మంచి గమ్మత్తు జరిగింది క్లబ్బులో... నేనో కథ చెప్పాను మావాళ్ళకి—"

"భోంచేద్దురూ... మీరు కథలు చెప్పంది ఎప్పుడు? ఆ కథలు కబుర్లు మొదలెట్టారంటే ఏం తింటున్నదీ కూడా పిల్లెరగరు... ముందు భోజనం కానీండి" గదమాయించింది సుశీల.

"అబ్బ, తింటాలేగాని ఇది వినండి ముందు. ఆ కథ చెప్పినా పిచ్చివెధవలు అది కథే అనుకున్నారు, పైగా అది

కేవలం కథట. మనుష్యుల కథ కాదట, అలాంటి మనుషు లుండరట..." పకపక నవ్వుతూ అన్నాడు ఆనందరావు.

"నీవేంకథ చెప్పావో నాకు తెల్సులే... ఎన్నిసార్లు చెపుతావు ఆ కథ, విసుగు విరామం లేకుండా. ఎన్నివూర్లు ట్రాన్స్‌ఫర్ అయ్యావో అన్నివూళ్ళలో చెప్పివుంటావు. అలా చెప్పూండు, నీవేదో ఎవరికి అర్థం కావనుకుంటావు... ఓ రోజు నలుగురికి తెలుస్తుంది."

"ఏం తెలిస్తే? ఏం చేస్తారేమిటి, ఇన్నాళ్ళూ లేంది ఇంక తెలిసి వీళ్ళందరూ మన్ని చేసేదేమిటి?"

"అవునుగాని, ఈ వూర్లో నన్నే అవతారం ఎత్తిం చావు" మాధవి నవ్వుతూ అడిగింది. "నీవా, వుండుండు, జ్ఞాపకం తెచ్చుకోనీ... దొడ్డమ్మ కూతురువా. సుశీ అక్కవా? మా అమ్మ చెల్లెలివో, మేనత్త కూతురివా? ఏదేదో... పాపం నీ మొగుడు నిన్ను వదిలేస్తే నేను నిన్ను చేరదీసి, ఇంట్లో వుంచుకు తిండిపెడుతున్నాను... చూసుకో నా హృదయవైశాల్యం." ఆనందరావు నవ్వి ప్రక్కనున్న మాధవి భుజం చరిచాడు.

"అవునవును. మీరు చాలా గొప్పవాళ్ళు. మధూ వచ్చి మీ ముందరికాళ్ళకి బంధం వేయబట్టిగాని, ఈనాటికి ఈ ఇంటిని భార్యల కోఆపరేటివ్ సొసైటీ చేసేవారు కాదూ" అంది సుశీల.

"నీ బోడి ఉపమానం చాలించు. మధూ వేసిన బంధం ముందరికాళ్ళకి కాదు - మనస్సుకి."

"పోనీలెండి, నాకు కవిత్వంరాదు. మీా అంత తెలివి తేటలు లేవు"– బుంగమూతి పెట్టింది సుశీల. "అదొక్కటే నీలో సుగుణం" అని ఆ ఎంగిలినోటితో ఆమెవైపు వంగాడు. మాధవి కళ్ళకి చెయ్యి అడ్డంపెట్టుకుని నవ్వుతూ "చెయ్యి ఎప్పుడు తియ్యమంటారో చెపితే సంతోషిస్తాను" అంది.

ఈసారి సిగ్గుపడడం సుశీల వంతైంది. ముగ్గురూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

ప్రసన్నత, ప్రేమ, ఆప్యాయతలు మూర్తీభవించిన దేవాలయాల్లాగ కనిపించారు వారు ఒకరికొకరు.